# మౌనం

అలనాటి భారతదేశంలో
ఆదికాలం నాడు
అడవుల్లో కట్టుకున్న పర్ణశాలల్లో
గురుత్వం వహించిన మునిపుంగవులు
ఆరుబయటి చెట్ల క్రింద
మౌనంగా కూర్చొని
శిష్యులకు విజ్ఞానాన్ని
అందించేవారట.
ప్రశ్నలు పుట్టినచోటనే
అర్థాలు ఉంటాయని
వాటిని వెతుక్కోవడమే
శిష్యరికమని
తెలియచెప్పడమే,
ముని మౌనం.
సిస్టీన్ ఛాపెల్ లో
ఒంటరిగా...
మౌనముద్రలో ఆశీనుడై
ఆలోచనల్లో లీనమైపోయాడు
మైకలాంజెలో "మోజెస్".
ఏకాంతంగా
గెడ్డం క్రింద చెయ్యి పెట్టుకొని,
దేన్ని గురించో విచారణ చేస్తూ
తనలో తానే
చూసుకుంటున్నాడు!
రోడాన్ "థింకర్".
వీళ్ళూన్నూ
మునిపుంగవుల్లా
దీర్ఘాలోచనల్లో మునిగి
వెతుకుతున్నారు
నిరంతరం
పుడుతున్న ప్రశ్నలకు
జవాబుల కోసరం
మౌనంగా.

- య స్వీ రామారావు